కథ

# ఊసరవెల్లులు

షేక్ మస్తాన్ వలి



ఉద్యోగరీత్యా నేను 'కావలి'కి వచ్చి రెండు సంవత్సరాలైంది.

రైలుపేటలోగల ఓ యింటి సెకండ్‌ఫ్లోర్‌లో నా మకాం. నేను, నా భార్య, ముచ్చటగా ముగ్గురు పిల్లలుగల కుటుంబం మాది. మా యిల్లు పెద్దహాలు, ఆఫీసుగది, రెండు బెడ్‌రూమ్స్, కిచెన్, డైనింగ్ రూం కలిగి మాకు సరిగ్గా సరిపోయింది.

నావయస్సు నలభై. పిల్లల్లో పెద్దశాల్తీ మగ. మిగిలిన రెండూ ఆడ. వారి వయస్సులు వరుసగా పదహారు, పధ్నాలుగు, పన్నెండు వుంటాయి. ఇక మా ఆవిడకు ముప్పై ఐదేళ్లు.

నే చేసేది పెద్ద ఉద్యోగమే. జీపు, అటెండర్లు, వాచ్‌మెన్లు వగైరాలు గలిగిన ఈ పోస్టు సాధించటానికి నానా అవస్థలూ పడ్డాను. ప్రస్తుతానికి అన్నీ సవ్యంగా జరిగిపోతున్నాయి.

ఈరోజు ఉదయాన్నే బ్రష్ చేసుకున్నాక నేను, మా ఆవిడ యిద్దరం కాఫీ సేవిస్తూండగా... అకస్మాత్తుగా మా యింటివెనుక భాగంలో ఎవరో అరుచుకుంటున్న శబ్దాలు వినిపించాయి. దాంతో నేను చెవులు రిక్కించి వింటూ మా హాల్లోని కిటికీ వద్దకు వెళ్లి అటుగా తొంగిచూశాను.

పరంధామయ్య ఇంటిముందు తగాద జరుగుతూ కనిపించింది.

పరంధామయ్య ఓ చిరుద్యోగి. వయస్సు యాభైపైనే వుంటాయి. భార్య, నలుగురు పిల్లలు, ఓ బావమరిదితో కలిసి అతనిది బహుపెద్ద కుటుంబం. కాగా ఈ లంపటానికంతా సరిపడ్డ ఆదాయం లేదతనికి. అలా అని సర్దుకుపోయేరకం కాదు. అన్నింట ఢాంబికాలు, దర్పాలు ప్రదర్శిస్తుంటాడు. అతని పెద్ద పెద్ద మాటలకు చిన్న చిన్న చేష్టలకు పొత్తు కుదరక ఎప్పుడూ ఏదో ఒక ఘర్షణ జరుగుతూనే వుంటుంది. ఈరోజు అలాంటిదే జరిగి వుంటుందని వూహించి నేను శ్రద్ధగా వారి మాటలు వినసాగాను.

"ఏం బాబు! పాలు చిక్కగా లేవేంటి?" పరంధామయ్య భార్య పాలవాడ్ని అడిగింది.

"ఉన్నంతలో చిక్కగానే వున్నాయండీ!... ఎటొచ్చీ గేదె మారింది!... ఎంత మేత పెట్టినా మా కొత్త గేదె పాలు పలుచగానే వుంటున్నాయండీ!... అదీ సంగతి!" పాలబ్బాయి వివరణిచ్చాడు.

"అదేం విడ్డూరమయ్యా!" ఆ పెద్దావిడ నోరు నొక్కుకుంది.

ఇంతలో ఆ ఇంటి బామ్మర్ది రంగప్రవేశం చేసి, "ఏంటి సంటీ!... ఏవో కాకమ్మ కథలు చెప్పేస్తున్నావు?... కావాలంటే మీరు మా యింటికొచ్చి



నొక్కుకుంది.

ఇంతలో ఆ ఇంటి బామ్మర్ది రంగప్రవేశం చేసి, "ఏంటి సంటీ!... ఏవో కాకమ్మ కథలు చెప్పేస్తున్నావు?... కావాలంటే మీరు మా యింటికొచ్చి చూడండీ!... మీకే అది బోధపడిద్ది!" అని ఏ జంకు గొంకు లేకుండ అన్నాడా కుర్రోడు.

"అంటే... ఏంట్రా నీ వుద్దేశ్యం? మావని మానుకొని మేము మీ ఇంటికొచ్చి బర్రెల్ని తనిఖీ చేయాలా? బుద్ధి లేదా భడవా!... ఏదేదో నోటికొచ్చినట్లు పేలుతున్నావు!" అంటూ వరంధామయ్య వీరావేశంతో అందులో తలదూర్చాడు.

ఆపై ఆయన తన ధీటైన వత్తాసుకు బామ్మర్ది మెచ్చికోలు ఖాయమని ఎంచి అతని వైపు గర్వంగా చూశాడు.

బామ్మర్ది కూడా శభాష్ అన్నట్లు సైగల్తోనే బావకు తెలియపరిచాడు.

ఈ సంఘటనకు బిత్తరపోయిన పాలతను మెల్లగా తేరుకొని, "ఏంటండీ! పెద్దోరు!... అలా ఒరే అంటున్నారు! పైగా తిడుతున్నారు. బాగాలేదు... ఏది ఏమైనా నే చెప్పే గేదె విషయం నిజమండీ!" అంటూ సర్ది చెప్పాడు.

కాగా ఎదుటివాని శాంతాన్ని అలుసుగా తీసుకున్న వరంధామయ్య పేట్రేగిపోయి, "తిట్టటమేంట్రా!... దొంగముండా కొడకా!.. ఏకంగా తంతాను. ఎవరడ్డొస్తారో చూస్తాను!" అంటూ ఉగ్రుడై ముందుకు దూకసాగాడు.

అప్పుడు బామ్మర్ది ఆయన్ని పట్టుకొని ఆపటానికి ప్రయత్నించాడు. కాని పెద్దాయన మాత్రం పట్టుగా ముందుకే విజృంభిస్తున్నాడు.

వారిద్దరి పెనుగులాటలో వాస్తవం కంటే నాటకీయత ఎక్కువగా కనిపించి నేను లోలోనే నవ్వుకున్నాను.

జరుగుతున్న హఠాత్ పరిణామం పాలబ్బాయిని కొద్దిసేపు ఖిన్నుడిని చేసింది.

ఈలోగా పెద్దాయన బామ్మర్ది చేతుల్లో యిరుక్కొని ముందుకు రాలేక పాలవాడిని ఉరిమి ఉరిమి చూస్తున్నాడు. ఆయన బుర్ర మీసాలు బుసలు కొడ్తున్నాయి. పళ్లు పటపటలాడుతున్నాయి.

అప్పటికి కొంత తేరుకున్న పాలతను కూడా ప్రత్యర్థివైపు తీక్షణంగా చూసి, "... సరే! సరే! ... వుండండి! ... వస్తా!" అంటూ సైకిలెక్కి అక్కడినుంచి సడీ సప్పుడు లేకుండా వేగంగా వెళ్లిపోయాడు.

దాంతో పెద్దాయన, "వెధవ కాన! జారుకున్నాడల్లే వుంది.. లేకుంటే చీరేసేవాడిని... అయినా ఈ వరంధామయ్యతోనా వాడి పరాచకాలు!" అంటూ జబ్బలు చరుచుకుంటున్నాడు.

"వాడితో ఏంటి బావ!... పిరికి సన్నాసి!... మీ కెపాసిటీకి వాడొక లెక్కా!" అంటూ బామ్మర్ది విజయగర్వాన్ని ప్రదర్శించసాగాడు.

ఆ పాలవాడిది పక్కనున్న పల్లె. మాకూ వాడే పాలు పోస్తాడు. మనిషి మంచివాడు. నెమ్మదస్తుడు. కాని తగాదకు భయపడి పారిబోయేటంత పిరికివాడు కాదు. మరెందుకలా వెళ్లిపోయాడో నాకర్థం కాలేదు.

ఆపై నేను 'పాలవాడ్ని బెదిరించడం యింత తేలికా?' అనుకుంటూ స్నానాది కార్యక్రమాలు ముగించుకొని హాల్లోకి వచ్చేసరికి మళ్లీ ఆ రణగొణధ్వని వినిపించసాగింది. ఈసారి అది మరీ జోరుగా వుంది.

"మళ్లీ ఏమైంది!" అని అనుకుంటూ కిటికీ లోంచి తొంగిచూశాను.

ఇంకేముందీ!

పాలబ్బాయి తన తోటి ఓ డజను పాలవాళ్లతో వరంధామయ్య యింటిని ముట్టడిచేసి గందరగోళం చేస్తున్నాడు. వారంత ఎవరి సైకిల్‌పై వారు కూర్చొని, ఒక కాలు నేలపై, యింకో కాలు పెడల్‌పై వుంచి ప్రత్యర్థి స్థావరాన్ని అతలాకుతలం చేసేలా చూస్తున్నారు.

ఇక పాలహీరో మాత్రం, 'ఏరా!... యిందాకేదో నోటికొచ్చినట్లు తిట్టావ్! పైగా కొట్టబోయావ్!... మరి యిప్పుడు బైటకిరా!... తేల్చుకుందాం!... బస్తీమే సవాల్!' అని అంటూ వరంధామయ్యపై పెద్దగా రంకెలేస్తున్నాడు.

మిగిలిన వాళ్లంతా కోరస్‌గా, "రారా!... రా!... మరి! నువ్వో?... మేమో? ... తేల్చుకుందాం!... మావాడ్ని ఒక్కడ్ని చేసి తిడ్తావా?" అని వంత పాడుతున్నారు.

వాళ్లందరు పొంచివున్న వేటకుక్కల్లా వున్నారు.

కాగా వరంధామయ్య ప్రభృతుల జాడలు, నాకెక్కడా కనిపించలేదు. "ఈ ధాంభికోత్తములు యిప్పుడెక్కడబ్బా!" అనుకుంటూ నేను చుట్టూ కలియచూశాను.

వారి కుటుంబసభ్యులంతా దొడ్డివాకిట చేరి ఏవో గుసగుసలాడుకుంటూ కనిపించారు.

"అంటే... తోక ముడిచినట్లేనా!" నాకు సందేహం కలిగింది. అయినా పాలవాళ్లు మాత్రం వారినెట్టి పరిస్థితుల్లో వదిలేలా లేరు.


అలా యింకో ఇరవైనిముషాలు గడిచాక వరంధామయ్య మెల్లిగా మెయిన్‌డోర్ తెరుచుకుని పిల్లిలా బయటకొచ్చాడు. అతని వెనుక మిగిలిన బంధువర్గమంతా వున్నారు. వారందరి ముఖాల్లో భయం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

రాగానే వరంధామయ్య, "ఏంటీ యీగోల?... యింటి ముందు!.. యిదిగో పాలబ్బాయి! చూడు!... నీవు చేసిన యీ



### వాటర్ థెరపీ

ఓ చిన్న ప్రక్రియతో ఆహ్లాదం కలిగించుకోవచ్చు. స్ప్రే బాటిల్‌లో ఫిల్టర్ నీరు నింపాలి. దాంట్లో రెండు మూడు చుక్కలు ఎసెన్షియల్ ఆయిల్‌రోజ్, స్వీట్ ఆల్మండ్ ఆయిల్, లిల్లీ, లావెండర్ వంటివేవైనాకలపాలి. ఫ్రిజ్‌లో రాత్రంతా పెట్టాలి. ముఖం, శరీరం మీద స్ప్రే చేసుకుని ఎక్కువైన దాన్ని టిష్యూతో తుడిచేయాలి. శరీరపరిమళంతో అంతా ఆహ్లాదమే, ఆనందమే!



చివరివనితో, మాతో మాట్లాడే అర్హతను కూడా కోల్పోయావు. కాబట్టి తక్షణం నీవు, నీ ముఠా అందరూ ఇక్కడనుంచి ఖాళీచేసి వెళ్లిపోండి!" అంటూ చింతచచ్చిన పులుపు తగ్గలేదనే సామెతగా అరిచాడు.

కాని తత్తరపాటు అతని గొంతులో ప్రతిఫలిస్తూనే వుంది.

తను చేసిన హడావిడికి అవతలివాళ్లు గప్‌చిప్‌గా వెళ్లిపోతారని ఆ పెద్దమనిషి ఊహ.

కాని నిజానికి అతని ఆ చర్యే పాలవాడ్ని మరీ రెచ్చగొట్టింది. దాంతో అతను పేట్రేగిపోయి, "ఏంట్రా! అర్హతల సంగతి మాట్లాడుతున్నావ్!.. అసలు నీవెంత?... నీ బిచానా ఎంత?... నిజంగా నీవు మగాడివే అయితే అక్కడే నుంచో! ... మేమొస్తున్నాం!" అంటూ సైకిల్ స్టాండేసి ముందుకు నడిచాడు.

మిగిలినవారు కూడ పెద్దగా తిట్టుకుంటూ అతన్ననుసరించారు.

చూస్తుంటే నాకు యిక యుద్ధమే తరువాయనిపించింది.

కాని ఈలోగ నేనూహించిన విధంగా పరంధామయ్య ప్రొఫైల్ మార్చేశాడు.

అతను యిరుగు పొరుగు యిళ్లవైపు నిశితంగా చూసి, ఎవరూ తమ తగాదాను గమనించడంలేదని గ్రహించి, వెంటనే ముఖాన్ని ప్రసన్నపూరితం చేసి, చిరునవ్వుతో ప్రత్యర్థి శిబిరం వైపు నడవసాగాడు.

బామ్మర్ది కూడా డిట్టో ఫోజ్‌లో అతన్ని అనుసరిస్తున్నాడు.

"ఈ విచిత్రమేమిటబ్బా!" అని అనుకుంటూ నేను, నా శ్రీమతి ఆసక్తిగా చూస్తున్నాం.

కాగా బామ్మర్ది సరాసరి పాలవాడి వద్దకెళ్లి గభాల్న అతని చేతులు పుచ్చుకొని, '... ఏంటి పాలబ్బాయిగారు! ఈ చిన్న విషయానికింత సీరియస్ అవుతున్నారు!... మా బావకు ఉదయాన్నే బి.పి. ఎక్కువై వుంటుందయ్యా! అందుకని అలా ఎదుటివారిపై ఆయనకు తెలియకుండానే విరుచుకుపడ్తుంటాడు. అప్పటికి నేనూ ఆయన్ని ఆపుతుంటాను. కాని యివ్వాళ నిజంగా మా దురదృష్టం నాయనా!... ఆయనగారు అలిగి ప్రవర్తించారు... అందుకు మీరందరూ పెద్దమనస్సు చేసుకుని... ఆ పెద్దాయన్ని క్షమించాలి!' అంటూ సవినయంగా అడిగాడు.

అందుకు పాలవాళ్లు దురుసుగ, '... రబస చేసిందా పెద్ద మనిషైతే, క్షమాపణగురించి మీరు మాట్లాడతారేంటి? ఆయనకేం మాటలు రావా? .. మరి యింతకు ముందేగదయ్యా... పెద్ద నోరు పెట్టుకొని మాపై గాండ్రించాడు' అన్నారు.

ఇక వుచ్చు బిగిసిందని తెలిసిన పరంధామయ్య గబగబ నోరువిప్పి, 'క్షమించండి బాబులూ!... యింకెప్పుడూ అలా చేయను!' అని పాలబ్బాయి చేతులు పట్టుకున్నాడు. అప్పుడు చూపుల్లో కూడా పశ్చాత్తాపపడుతున్న ధోరణి ని ండుగా ప్రదర్శించాడు.

దానికి తోడు బామ్మర్దికూడ కలుగజేసుకుని, ... 'ఆయనే అడుగుతున్నాడు కదండీ!... యిక వదిలేయండి నాయనా!' అంటూ మొత్తుకున్నాడు.

కాగా పాలవాళ్లందరూ మరో ఐదునిముషాలు వారిలో వారే మాట్లాడుకొని ఓ నిర్ణయానికొచ్చారు.

చివరగా పాలబ్బాయి పరంధామయ్య దగ్గరకొచ్చి, 'చూడు మాష్టారూ!.. ఈసారి కేదో పెద్దోడివి కదా అని వదిలేస్తున్నాను!... ఇంకోసారి తిక్కవేషాలేసావంటే, ఖబడ్దార్! ... మా తడాఖా చూపిస్తాం!' అంటూ స్ట్రాంగ్ వార్నింగిచ్చి, 'పదండ్రా!' అంటూ తోటి వారిని తీసుకొని అక్కడ్నించి నిష్క్రమించాడు.

దాంతో బావ, బామ్మర్దులు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

ఈలోగా యిరుగుపొరుగువారు ఒకరిద్దరు అటుగ వచ్చి సంగతేంటని వారినడిగారు.

దానికి పరంధామయ్య వెంటనే ముఖ కవళికలు మార్చేసి కుడిచేయిని ఎడమ మీసం పైవేసి దువ్వుతూ, 'ఆ... ఏం లేదండీ! మా పాలవాడేదో పరాచకంగా సమాధానమిస్తే, నాలుగు దులిపి పంపించాను!... పిరికి నాయాలు పారిపోయాడు. లేకుంటే చంపేసేవాడిని.' అన్నాడు తిరిగి ధాంబికంగా.

బామ్మర్ది కూడా అందుకు వత్తాసుగ వర్ణించి వర్ణించి చెప్పేస్తున్నాడు.

ఇక విన్నవారు, 'ఆఁ... అలాగా అండి! మంచి శాస్తి చేశారు!' అని బావ బామ్మర్దిని పొగిడి మరీ వెడుతున్నారు.

అయితే క్రికెట్‌లో థర్డ్ ఎంపైర్‌లా అన్నీ గమనిస్తున్న నేను, నా శ్రీమతి మాత్రం, "ఔరా! మనుషుల్లో ఊసరవెల్లులంటే వీరేనేమో!" అని నవ్వుకొని, అక్కడ్నించి కదిలి మా దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాం.

## మద్యప్రియులకు మరో పానీయం

బీర్ తాగేవారికి ఇది మంచి వార్తే. ఇప్పుడున్న బీర్ కన్నా త్వరగా నిశా ఎక్కించేదీ, ఆల్కహాలు 23 శాతం ఎక్కువగా వుండేదీ అయిన బీరొకటి త్వరలో బజారులోకి రాబోతున్నది. 'డాంగ్ ఫిష్ హెడ్ వరల్డ్ వైడ్ స్టవుట్' పేరున్న దీని ఖరీదు దాదాపు రు. 450/లు వుండొచ్చు. మామూలు బీర్ కన్నా ఐదింతలు మత్తెక్కించే దీనికి స్ట్రాంగ్ కాదు, సూపర్ స్ట్రాంగ్ కాదు, 'ఎక్స్‌ట్రీమ్ బీర్' అని పేరు పెట్టారు.